క్లుప్తంగా

భారీ అన్న సమారాధన



రామాలయంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని సుంకర పద్దయ్య వీధిలో సింహాద్రి అప్పన్న కోదండ రామాలయం ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని గత ఏడాది పునఃనిర్మించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో వెయ్యి మందికి పైగా భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం



స్థానిక లయన్స్ కార్యాలయం వద్ద ఉచిత మెగా వైద్యం శిబిరం దృశ్యం

ఆకివీడు: ప్రజల ఆరోగ్యానికి లయన్స్‌క్లబ్‌లు సేవలు అభినందనీయమని రీజనల్ చైర్మన్ దాట్ల రామరాజు చెప్పారు. స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీపీ, సుగర్ వంటి వాటిపట్ల నిర్లక్ష్యం తగదన్నారు. శిబిరంలో జనరల్, సర్జరీస్, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, చర్మవ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వీవీ.కృష్ణంరాజు, మోటుపల్లి శ్రీనివాసరావు, చింతారావు, వీ.సుబ్రహ్మణ్యం, ఎం.షరీఫ్, ఎండీ. అహ్మద్, వీ.శ్రీనివాసరాజు, ఈవీవీ.సత్యనారాయణ, ఎండీ.జక్కీ తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించారు.

చర్చి నిర్మాణానికి విరాళం



బొండాడ పెదపేటలో చర్చి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న గ్రామ పెద్దలు

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో పెదపేటలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి గ్రామ పెద్దలు బుధవారం విరాళం అందజేశారు. చర్చి నిర్మాణంలో తాము కూడా భాగస్వాములు అవుతామంటూ గ్రామ పెద్దలు ఇచ్చిన మాట ప్రకారం లక్ష రూపాయల విరాళాన్ని సంఘ పెద్దలకు అందజేశారు. గ్రామంలో అందరం కలిసికట్టుగా ఉంటామని వర్గ విభేదాలు లేకుండా అన్నదమ్ములు భావంతో కలిసిమెలిసి ఉంటామని మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావు, ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజులు ఈ సందర్భంగా తెలిపారు. గ్రామ పెద్దల సహకారంతో మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావు ప్రోత్సాహం ఆయన చేతుల మీదుగా విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మన్నే శ్రీనివాస్, మందపాటి వెంకన్న, కందుల వెంకట ప్రభాకర్, మన్నే సోమేశ్వరరావు, మందుపాటి రవి, కట్టసుబ్బయ్య, పెనుమత్స రంగరాజు, కరుణాకర్, ప్రసన్నకుమార్, గ్రామ పెద్దలు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరుని సేవలో...



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఒడ్లు వలుస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 18 నుంచి ప్రారంభం కానున్నాయి. స్వామివారి కల్యాణం నిమిత్తం ఉపయోగించే తలంబ్రాల బియ్యం కోసం ఒడ్లు చేతితో ఒలిపిస్తున్నారు. ఇలా స్వామివారి తలంబ్రాల నిమిత్తం ఒడ్లు ఒలిపించడం ఇదే మొదటిసారని ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. దాండియా గ్రూపు మహిళలు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఒడ్లు వలుస్తున్నారు. 50 కేజీల ఒడ్లు వలిపిస్తున్నారు. అలాగే స్వామివారిని పెండ్లికొడుకుగా అలంకరించేందుకు ఉపయోగించే పసుపు కుంకుమలు కూడా నేరుగా ఆలయంలోనే తయారు చేయిస్తున్నామని తెలిపారు. ఒడ్లు వలుస్తున్న మహిళకు భోజనాలు, తాగునీరు వంటి ఏర్పాట్లను ఆలయ కమిటీ కల్పించింది.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- గాంధీజీ కలలు సాకారం చేసిన సీఎం జగన్
- అన్ని గ్రామాల్లో సచివాలయ భవనాలు నిర్మించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- గ్రామాల్లో ప్రజలకు సులభతరమైన సేవలు





ప్రాతళ్లమెరక గ్రామంలో సచివాలయం, ఆర్బీకే , హెల్త్ సెంటర్ల భవనాల సముదాయం, సీసలి గ్రామంలో ఆకట్టుకుంటున్న సచివాలయ భవనం →

కాళ్ల: సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శం. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు సేవలు సులభతరం చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదర్శ ముఖ్యమంత్రిగా దేశంలో అందరి మన్ననలు పొందుతున్నారు. గతంలో ఒక పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరిందంటే దాన్ని నిర్మించాలంటే దశాబ్దాలు అయినా పూర్తి చేసిన పరిస్థితులు ఉండేవి కావు. కానీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పదవి చేపట్టిన వెంటనే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలనే మంచి సంకల్పంతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. గ్రామాల్లో ఒక్కో సచివాలయం నిర్మించడానికి రూ.43 లక్షలు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా సచివాలయంతో పాటు రైతు భరోసా కేంద్రం హెల్త్ సెంటర్ల భవనాల నిర్మించారు. సచివాలయంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండటంతో ప్రజలకు సేవలు అందుబాటులోకి వచ్చాయని ఇప్పటికే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ పని కావాలన్న మండల కేంద్రం చుట్టూ తిరగాల్సి వచ్చేదని కాని జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏ పని కావాలన్నా ఏ సంక్షేమ పథకం పొందాలన్న గ్రామంలోనే సేవలు అందుతున్నాయని పలువురు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రైతు భరోసా కేంద్రం వల్ల రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి రావడంతో పాటు వ్యవసాయ అధికారులు సేవలు కూడా చెంతకే వచ్చాయని రైతులు చెబుతున్నారు. అదేవిధంగా ప్రతి గ్రామల్లో హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల వైద్యం కూడా అందుబాటులోకి వచ్చిందని ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ నిర్మాణాలకు సుమారు రూ .80 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే నియోజకవర్గంలో ఎక్కువ గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్ని గ్రామాల్లో ప్రారంభోత్సవాలు కూడా చేయటం జరిగింది. నియోజవర్గంలో 73 గ్రామాల్లో ఒక్కొక్క గ్రామంలో రూ సుమారు రూ. 80 లక్షలు చొప్పున నిధులు ఏర్పాటు చేయటం అంటే సామాన్యమైన విషయం కాదని పలువురు పెద్దలు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో ప్రజాప్రతితులు పార్టీ నాయకులు ప్రత్యేకత శ్రద్ధ తీసుకొని ప్రభుత్వం ఇచ్చిన నిధులతో పాటు తమ సొంత నిధులు హెచ్చించి అధునాతనమైన సచివాలయం భవనాలు నిర్మించారు. సచివాలయంలో వివిధ పనుల మీద వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా ఆయా శాఖ అధికారులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల్లోను సచివాలయం, రైతు భరోసా, కేంద్రం హెల్త్ సెంటర్ భవనాలు ప్రజలకు, రైతులకు, రోగులకు ఇబ్బంది లేకుండా ఒకే చోట ఉండేలా నిర్మాణాలు చేశారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడంతోపాటు ఇంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించి గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ ముఖ్యమంత్రిగానే ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

గాంధీజీ కలలకు సహకారం



సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే పరిపాలన తీసుకొచ్చారు. ఆయన తీసుకొచ్చి వ్యవస్థ ప్రతి నాయకుడికి ఆదర్శం. అన్ని శాఖల అధికారులు ఒకే చోట ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తీరుతున్నాయి.

గణేష్న రాంబాబు
కాళ్ల వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

గ్రామాల్లోనే రైతులకు సేవలు



రైతు భరోసా కేంద్రాలు గ్రామాల్లో నిర్మించడం వల్ల రైతులు చెంతకే అధికారులు వెళ్లి సేవలందిస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు ఎరువులు రైతులకు సకాలంలో అందుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతిగా వ్యవసాయ రుణాలు కూడా అందించడం వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. గతంలో వ్యవసాయ అధికారిని కలవాలంటే మండల కేంద్రం వెళ్లి కలవాల్సి వచ్చేది. కానీ సీఎం జగన్ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయడంతో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వగలుగుతున్నారు.

పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు,
జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యుడు కలవపూడి

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు



గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్దపీట వేశారు. గ్రామాల్లో హెల్త్ సబ్ సెంటర్లు నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పాటు భవనాలు కూడా నిర్మించారు. దీంతో వైద్యానికి మండల కేంద్రం వెళ్లే పని లేకుండా గ్రామాల్లోనే వైద్యులు వైద్య సేవలు అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్యులు ప్రజలు వద్దకే వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందించి ప్రజలకు మేలు చేస్తున్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజల పట్ల ప్రేమ ఆప్యాయత చూపిస్తూ వైద్య రంగానికి పెద్దపీట వేసిన జగన్ ఆదర్శ ముఖ్యమంత్రి.

వేగేశ్న జయ రామ కృష్ణంరాజు,
కోపల్లె సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్. పెద అమీరం

ముగిసిన పదో తరగతి పరీక్షలు



ఉత్సాహంగా ఉండి పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఉండి: పదోతరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో ఉండి ఏ, ఉండి బీ కేంద్రాలతో పాటు ఉప్పులూరు, యండగండి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల్లోని జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించారు. ఉండి ఏ, బీ కేంద్రాలతో పాటు మండలంలోని మరికొన్ని కేంద్రాల్లో ఫ్లెయింగ్ స్క్వాడ్ ఆకస్మికంగా తనిఖీలు చేసింది. అయితే ఎక్కడా మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించడంతో అంతా సాఫీగా జరిగిపోయింది.ఈ యేడాది సుమారు 93 శాతం మంది విద్యార్థులు పరీక్షలు హాజరైయ్యారని తెలిపారు. చివరి పరీక్ష సోషల్ స్టడీస్‌కు మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల నుంచి 572 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 12 మంది గైర్హాజరైయ్యారు. అలాగే కంపార్ట్‌మెంటల్ విద్యార్థులు 67 మంది పరీక్ష రాయగా 40 మంది గైర్హాజరైయ్యారు.మొత్తంమీద 639 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 52 మంది గైర్హాజరైయ్యారు. అన్ని పరీక్షల్లోను ఎక్కువశాతం మంది కంపార్టెమెంటల్ విద్యార్థులే అధికంగా పరీక్షలకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

- ఉండి నియోజవకర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్
- ఆకివీడులో ఎన్నికల ప్రచారం బ్రహ్మరథం పట్టిన ప్రజలు



స్థానిక 8వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆకివీడు: సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ అభ్యర్థి పీవీఎల్.నర్సింహరాజు అన్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 8,9 వార్డుల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తునారన్నారు. సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతున్నాయని చెప్పారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్న, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు కూటమిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓడిపోయినా జనక్షేత్రంలోనే పీవీఎల్ నిత్యం తిరుగుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యల్ని, అభివృద్ధి కార్యక్రమాల్ని, పట్టువదలని విక్రమార్కుడులా అమలు జేస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ బీసీలకు అండగా ఉంటూ నర్సాపురం పార్లమెంట్ టిక్కెట్‌ను బీసీ మహిళకు కేటాయించారని చెప్పారు. బీసీ అభ్యర్థిని గూడూరి ఉమా బాలకు, పీవీఎల్‌కు ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు మాట్లాడుతూ అందరివాడుగా ఉన్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీవీఎల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల మధ్య తిరుగుతూ, ప్రజా సమస్యల్ని తెలుసుకుని పరిష్కరిస్తూ, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్ని విస్తృతంగా నిర్వహించిన పీవీఎల్‌కు ఎమ్మెల్యే పదవి ఇస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే.రసూల్‌బీబీ, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ.జహంగీర్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మేకా పార్వతి, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్సన, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, పట్టణ వైసీసీ అధ్యక్షుడు అంబటి రమేష్, జేసీఎస్ కన్వీనర్ శిరపు శ్రీనివాస్, వార్డు ఇన్‌చార్జి మన్నే లలితాదేవి, ఐటీ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ పడాల కిషోర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఈదా జాషువ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి మెడవంకల రత్నకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వరసిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ



వరసిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: మండలం జొన్నలపాలెంలో వరసిద్ధి గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, నరసాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దివ్య ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని ఆకాంక్షించారు. ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు, జేసీ ఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, వైసీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, జోగి సత్యదేవ్, కుక్కల దినేష్, చింతపల్లి రామచంద్ర, వేంద్ర మురళీకృష్ణ, బండి రాంబాబు, జె. వెంకటేశ్వరరావు, బోనం నాగ పరమేశ్వరరావు, జొన్నల రాధాకృష్ణ, బండి నాగరాజు, గూడూరి ఓంకార్, మల్లుల పాటియ్య, బండి బాలాజీ భక్తులు పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు



భీమవరం డీఎన్నార్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు వివరాలను వెల్లడిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లకు నేషనల్ బోర్డు అఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించిందని కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు చెప్పారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమ కళాశాలకు క్వాలిటీ పరంగా విద్యాసంస్థలను మదింపు చేసే సంస్థ నాక్ గత ఏడాది ఆగస్టులో అత్యున్నత ఏ ++ గ్రేడ్ ఇచ్చిందని ప్రస్తుతం నేషనల్ బోర్డు అఫ్ అక్రెడిటేషన్ సంస్థ మూడు బ్రాంచ్‌లకు గుర్తింపు ఇచ్చిందని చెప్పారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) మాట్లాడుతూ ఉన్నత విద్యా సంస్థ అక్రిడిటేషన్ కలిగి ఉండడం వల్ల విద్యార్థులకు వారి భవిష్యత్ అవకాశాల్లో మెరుగైన ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ముందుగా కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు పుట్టిన రోజు సందర్భంగా కేక్‌కట్‌చేసి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటేసి మళ్లీ గెలిపించుకుందాం

వైఎస్సార్ సీపీ నాయకులు చెరుకువాడలో ఇంటింటా ప్రచారం



చెరుకువాడలో ఇంటింటికీ ప్రచారాన్ని నిర్వహిస్తున్న గ్రామ సర్పంచ్ సాంబశివరావు, తదితరులు

ఉండి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకొని, జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని చెరుకువాడ గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు అన్నారు. బుధవారం ఉండి మండలం చెరుకువాడ గ్రామంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగాను, ఉండి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను గెలిపించేందుకు తామంతా సిద్ధం అంటూ గ్రామ సర్పంచ్ సాంబశివరావు, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్రపాటి అనిత, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, గ్రామంలోని అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలని కోరారు. సంక్షేమం అభివృద్ధితో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. గతంలో ఎన్నికలంటే రాజకీయాలు చేసేవారని ఇప్పుడు రాజకీయం చేయాల్సిన అవసరం వైఎస్సార్ సీపీకి లేదన్నారు. ఎందుకంటే రాష్ట్ర ప్రజలు పుట్టిన నాటి నుంచి రాష్ట్రంలో ఇంత గొప్ప సంక్షేమ పాలన అందజేసిన నాయకులెవ్వరూ లేరని అన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారని తెలిపారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాల భవనాల రూపురేఖలు మార్చేశారన్నారు. అంతే కాకుండా ప్రతి పథకాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో వేసి ఎక్కడా అవినీతికి తావులేకుండా చేసారని అన్నారు.అటువంటి వ్యక్తినే మనం మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని అన్నారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలంటే ఉండిలో మన ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండవేటి సాంబశివరావు, పార్టీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి బందెల ప్రమీల, బందెల జార్జ్, బిల్‌మోరియా, గుండాబత్తుల సతీష్, బొడ్డు నాగన్న, తాడేపల్లి రాజు,వార్డు సభ్యులు,వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అఫిడవిట్లకు మార్గదర్శకాలు పాటించాలి

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు అఫిడవిట్లులో మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి స్వామినాయుడు అన్నారు. బుధవారం ఆచంటలోని ఎన్నికల అధికారి కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసే తాత్కాలిక కార్యాలయాలకు సంబంధించి మార్గ దర్శకాలు జారీ చేశారు. ఇవి ప్రభుత్వ, ప్రైవేటు ఆక్రమిత స్థలాల్లోనూ. ఆసుపత్రులు, విద్యా సంస్థలు, పోలీంగ్ స్టేషన్‌కు 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయకూడదన్నారు. పార్టీ అభ్యర్థులు అనుమతులు తీసుకొని ఇంటింటి ప్రచారం నిర్వహించుకోవచ్చునన్నారు. కార్యక్రమాన్ని సర్వలైన్స్ టీం కవర్‌చేసి ఫుటేజీని అకౌంటింగ్‌కు పంపిస్తారని, అనుమతి దాని కంటే ఎక్కువ ఖర్చు గమనిస్తే షాడో రిజిస్టర్‌లో నమోదు చేస్తారని హెచ్చరించారు. అభ్యర్థుల ఫాం 26 ఫైల్ మార్గ దర్శకాలను వివరించారు. వాటిని తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌కేఆర్‌లో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు ,ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మానసిన వికాశం పెరుగుతుందన్నారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బిహెచ్‌విఎస్ లక్ష్మి, జి సారిక తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ వెన్నంటే ముస్లింలు



నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మిని కలిసిన ముస్లిం యువకులు

ఆకివీడు: ముస్లింలు వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారని, ముస్లిం సహకారాన్ని మరువలేమని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి చెప్పారు. స్థానిక ముస్లిం యువకులు బుధవారం ఆమెను కలిసి ముస్లింల మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కూటమిని ముస్లింలు, మైనార్టీలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నమ్మించి మోసం చేసే టీడీపీ కుటిల రాజకీయాల్ని ప్రజలు నమ్మరన్నారు. ఈ ఎన్నికల్లో ఆయా కూటమి పార్టీలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్ మోహన్ రెడ్డి అందరివాడుగా ప్రజలు గుర్తించారని లక్ష్మి అన్నారు. వచ్చే ఎన్నికల్లో యువతంతా కష్టపడి పని చేసి ఆయా మండలాల్లో అత్యధిక మెజార్టీ చేకూరే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎస్కే.రసూల్‌బీబీ, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ.జహంగీర్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జక్కీ, ఆలీ, పట్టణ వైసీపీ ఉపాధ్యక్షుడు ఎస్కే. ఆరీఫ్, వైసీపీ మైనార్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ మోతీ, ఎస్‌సీ సెల్ జిల్లా కార్యదర్శి కురెళ్ల పాలు, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఎండీ.మాబూ, హుస్సేన్, గాలీబ్, ముషీర్, రషీద్, ఎండీ. షైఫ్, వసీమ్, రఫీ, పయాజ్, హామీదీ, రాజా, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర ఏర్పాట్లు ప్రారంభం

మొగల్తూరు: మొగల్తూరులోని కుక్కలవారితోటలో వేంచేసియున్న చెట్టుకింద ముత్యాలమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఏటా ఉగాది పండుగకు 15 రోజుల ముందుగా అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించి కాలువలో స్నానం చేయించి తిరిగి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పూరిపాకలో ఉంచుతారు. ఉగాది రోజున అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహిచడం ఆనవాయితీ. బుధవారం అమ్మవారి ఘటాలను గ్రామంలోని వీధుల గుండా ఊరేగించారు.